RNI NO. APTEL/2014/58326
తెలుగు దినపత్రిక
సంపుటి : -13 సంచిక : 116 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి
శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి
05-03-2026 గురువారం వెల : 1/- పేజీలు : 4

## క్రాప్ డైవర్షన్‌కు ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ...
# రైతుల ఆదాయవృద్ధే లక్ష్యం

- హార్టికల్చర్ హబ్ దిశగా 15 లక్షల హెక్టార్లలో క్రాప్ డైవర్షన్ ప్రణాళిక
- భూగర్భ జలాల పరిరక్షణ...ప్రత్యామ్నాయ పంటలకు ప్రోత్సాహం
- విపత్తుల బారిన పడకుండా ఖరీఫ్ రెండు నెలల ముందుకు... రైతులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు
- క్రాప్ డైవర్షన్, మద్దతు ధరలు, సేంద్రీయ వ్యవసాయం, కౌలు రైతుల రుణాలపై అసెంబ్లీలో వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సమగ్ర వివరణ

నవతరం -అమరావతి

రాష్ట్రంలో వరి పంట సాగు విస్తీర్ణాన్ని సమతుల్యం చేస్తూ రైతులను లాభదాయకమైన ప్రత్యామ్నాయ పంటల వైపు దారితీసే స్పష్టమైన విధానాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అసెంబ్లీలో తెలిపారు. క్రాప్ డైవర్షన్, మద్దతు ధరలు, సేంద్రీయ వ్యవసాయం, కౌలు రైతుల రుణాలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి అచ్చెన్నాయుడు సమాధానమిస్తూ, 2025--26 క్రాప్ ఇయర్‌కు రాష్ట్రంలో వరి సాగు చేస్తున్న రైతులు మొత్తం 38.97 లక్షల మంది ఉన్నారని, అందులో ఖరీఫ్ 26.94 లక్షలు, రబీ 12.03 లక్షల మంది ఉన్నారని వెల్లడించారు. అధిక వరి సాగు ప్రాంతాల్లో భూగర్భ జలాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, నూనె గింజల వంటి పంటలను ప్రోత్సహించేందుకు అవగాహన కార్యక్రమాలు, నాణ్యమైన విత్తనాల సరఫరా, సాంకేతిక మార్గదర్శకాలు, మార్కెటింగ్ సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు. 2025-26 సంవత్సరానికి సర్టిఫైడ్ సీడ్ ఉత్పత్తి ప్రణాళిక అమలు చేస్తున్నామని, ఎన్ జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాల ద్వారా ఆధునిక విత్తనాలను రైతులకు అందిస్తున్నామని తెలిపారు. మారుతున్న ఆహారపు అలవాట్లు, మార్కెట్ అవసరాలు, నీటి లభ్యత నేపథ్యంలో పంటల వైవిధ్యీకరణ అత్యవసరమని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చొరవతో అనేక ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తయ్యాయని, సాగునీటి లభ్యత పెరిగినప్పటికీ వరిపై అధిక ఆధారపడటం -మిగతా 3లో



## దళిత-ఆదివాసి జేఏసీ సమావేశం
# శ్రీకాకుళంలో నిర్వహణ

### ఎస్సీ, ఎస్టీ ఐక్యతతో హక్కుల సాధనకు తీర్మానాలు

నవతరం -శ్రీకాకుళం

శ్రీకాకుళం పట్టణంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విజ్ఞాన్ మందిరంలో దళిత-ఆదివాసి జేఏసీ సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశంలో వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొని పలు ముఖ్యమైన తీర్మానాలు చేశారు. ఎస్సీ, ఎస్టీ సబ్ కాస్టులన్నీ కలిసిమెలిసి ఐక్యంగా ఉండాలని, ప్రస్తుతం వేర్వేరుగా ఉన్న కుల సంఘాలన్నీ ఒకే జేఏసీగా ఏర్పడి మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో దళిత సమస్యలపై సమిష్టిగా పనిచేయాలని నిర్ణయించారు. దళిత-ఆదివాసీల హక్కులను పరిరక్షిస్తూ సమాజంలో గౌరవప్రదమైన జీవనం కోసం నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. నిరుద్యోగ యువతను అంబేద్కర్ ఆలోచన విధానానికి కార్యనిర్ముఖులను చేయాలని, ఎస్సీ-ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు ఆయా వర్గాలకే ఖర్చు చేయాలని, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించి అర్హులైన వారికి ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని తీర్మానించారు. అలాగే ఎస్సీ-ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ప్రతివారం గ్రీవెన్స్ నిర్వహించి సమస్యలను తెలుసుకుని, ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ నిర్వహించే జిల్లా గ్రీవెన్స్‌లో అధికారులతో చర్చించి పరిష్కారం సాధించాలని నిర్ణయించారు. శ్రీకాకుళం జిల్లాలో ఎస్సీ-ఎస్టీ రిజర్వుడ్ అసెంబ్లీ స్థానాలు లేనందున వాటి సాధన కోసం రాజకీయ పార్టీల నేతలను, జిల్లా అధికారులను కలిసి వినతి పత్రాలు సమర్పించి రాష్ట్ర ముఖ్యమంత్రి మరియు



ఎస్సీ-ఎస్టీ కమిషన్ దృష్టికి తీసుకువెళ్లాలని నిర్ణయించారు. అట్రాసిటీ కేసుల పరిష్కారం, ఎస్సీ-ఎస్టీ బ్యాక్లాగ్ ఉద్యోగాల భర్తీ, కార్పొరేషన్ ద్వారా ఉపాధి అవకాశాల కల్పన, భూతగాదాల పరిష్కారం వంటి అంశాలపై జిల్లా యంత్రాంగంతో సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు.
త్వరలో కొత్త జేఏసీ కమిటీని ఏర్పాటు చేసి భవిష్యత్ కార్యాచరణను ప్రకటించనున్నట్లు సంఘ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సంఘ ప్రతినిధులు పోతల దుర్గారావు, అంపోలు ప్రతాప్, ఎస్సీ-ఎస్టీ న్యాయవాద సంఘ ప్రతినిధులు, ఎస్సీ-ఎస్టీ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షులు గంజి ఎజ్రా, మానిటరింగ్ కమిటీ సభ్యులు తోట రాము, దండాసి రాంబాబు (జాన్), దళిత మహాసభ ప్రతినిధులు దత్తి గోవిందరావు, రెల్లి కులం సంక్షేమ సంఘ ప్రతినిధులు అర్జి కోటి, బెవర రాము, సుధాకర్, మాదిగ దండోరా సంఘ ప్రతినిధులు తిరుమల రావు, నారాయణరావు, ఆదివాసి సంఘ ప్రతినిధులు ఆవాల అప్పన్న, బహుజన టీచర్స్ యూనియన్ ప్రతినిధులు సిర రమేష్ బాబు, దళిత హక్కుల పరిరక్షణ సమితి ప్రతినిధులు నివర్తి శ్యాము సుందర్, బసవల చిన్నారావు, భైరి ధనరాజ్, రుప్ప అప్పలనాయుడు, ఎస్సీ-ఎస్టీ టీచర్స్ ఫెడరేషన్ ప్రతినిధులు కొప్పల డేనియల్, భూపతి రవికుమార్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు రావాడ వెంకట్రావు, లక్ష్మణరావు, అర్జీ ఈశ్వరరావు, త్రినాధ్ రామారావు, తారక్ తదితరులు పాల్గొని పత్రికా ప్రకటన విడుదల చేశారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవం వారోత్సవాల
# సందర్భంగా డిఫెన్స్ టెక్నిక్స్ - కరాటే శిక్షణ

నవతరం -శ్రీకాకుళం

అంతర్జాతీయ మహిళా దినోత్సవం వారోత్సవాలను పురస్కరించుకొని జిల్లా ఎస్పీ శ్రీ కె.వి. మహేశ్వర రెడ్డి, ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు బుధవారం శ్రీకాకుళం ఉమెన్ కాలేజీలో డిఫెన్స్ టెక్నిక్స్ అండ్ ట్రైనింగ్ (కరాటే శిక్షణ) కార్యక్రమం నిర్వహించారు.
మహిళా పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ నారిమణి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి అదనపు ఎస్పీ కె.వి. రమణ గారు, డీఎస్పీ వివేకానంద జీవీఎస్‌యూ విశాలాక్షి (పోక్సో కోర్ట్ స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్) ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.
ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ కె.వి. రమణ మాట్లాడుతూ మహిళలు ఆత్మరక్షణలో నైపుణ్యాలు అభ్యసించడం ద్వారా ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవచ్చని, ఎలాంటి అపాయకర పరిస్థితుల్లోనైనా ధైర్యంగా ఎదుర్కొనే సామర్థ్యం పెరుగుతుందని పేర్కొన్నారు.
మహిళల భద్రతకు పోలీసులు కట్టుబడి ఉన్నారని తెలిపారు. మహిళల సాధికారత, భద్రత లక్ష్యంగా ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు కొనసాగించనున్నట్లు తెలిపారు.
డీఎస్పీ వివేకానంద గారు మాట్లాడుతూ విద్యతో పాటు స్వీయ రక్షణ శిక్షణ కూడా ప్రతి యువతికి అవసరమని సూచించారు.



ఈ కార్యక్రమంలో అడ్వొకేట్ పొట్టునూరు పద్మ, హ్యూమన్ రైట్స్ సభ్యులు మణిశర్మ, డాక్టర్ తంగి సౌజన్య, జేసీఐ ప్రెసిడెంట్ టీ. ఉషారాణి, యోగ ప్రెసిడెంట్ తంగి స్వాతి, ఎస్.ఐలు లక్ష్మి, చంద్రకళ, లావణ్య, ఏ.ఎస్.ఐలు అరుణ కుమారి, రేణుక, మహిళా పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# కూటమి పాలనలో కల్తీప్రదేశ్‌గా మారిన రాష్ట్రం


### వైయస్సార్సీపి జిల్లా యువజన ప్రధాన కార్యదర్శి మడియ రామకృష్ణ

నవతరం-పలాస



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజా సంక్షేమాన్ని విస్మరించడమే కాక, ప్రజారోగ్యాన్ని నిర్వీర్యం చేయడం వల్ల , రాష్ట్రం కల్తీ ప్రదేశ్ గా మారిందని వైయస్సార్సీపి జిల్లా యువజన ప్రధాన కార్యదర్శి మడియా రామకృష్ణ అన్నారు. ఆయన బుధవారం పలాసలో మాట్లాడుతూ, ఎవరైనా బతకడం కోసం పాలు, తాగుతారన్నారు. కానీ రాష్ట్రంలో ఆ రెండు ప్రాణాంతకం అవుతున్నాయన్నారు. రాష్ట్రంలో ఏ ప్రాంతం చూసినా కల్తీ రాజ్యమేలుతుందని, పాలు, నీరు, ఆహారాన్ని కొందరు కల్తీ చేస్తుండంతో ప్రజలు ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయని రామకృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే కూటమి పాలనలో పసి బిడ్డలపై లైంగిక దాడులు, హత్యలు జరుగుతున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో నిమిషానికి ఐదుగురుపై లైంగిక దాడులు జరుగుతున్న అంటూ కేంద్ర ఇంటెలిజెన్స్ రిపోర్టు ఇచ్చిందన్నారు. గడచిన ఎన్నికల్లో ఇచ్చిన హామీలు సూపర్ సిక్స్ తో పాటు మరో 146 హామీలు అమలు చేయాలని ప్రజల తరఫున ఒక ప్రతిపక్షంగా వైయస్సార్సీపి కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుంటే, అందుకు తగ్గ సమాధానం చెప్పలేక, డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ, తిరుమల లడ్డూ లో కల్తీ జరిగిందంటూ సీఎం చంద్రబాబు ఒకరోజు ఆరోపిస్తే, మరోసారి పంది కొవ్వు కలిసిందంటూ టిడిపి నేతలు ఆరోపిస్తుంటే, జనసేన అధినేత , రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాత్రం మరో రకంగా మాట్లాడుతున్నారని, సిబిఐ నియమించిన సిట్ నివేదికలో కల్తీ జరగలేదని, సుప్రీంకోర్టుకు నివేదిక సమర్పిస్తే, అందుకు జీర్ణించుకోలేని కూటమి ప్రభుత్వ పెద్దలు రోజుకు ఒక అబద్ధాన్ని సృష్టిస్తూ, వైయస్సార్సీపి పై అసత్య ప్రచారం చేస్తున్నారని రామకృష్ణ మండిపడ్డారు. సంపద సృష్టిస్తామన్న చంద్రబాబు సూపర్ సిక్స్ హామీలు కూడా అమలు చేయలేకపోయారని, కనీసం ప్రజలకు మంచి తాగునీరు అందిస్తే చాలునని ఆయన విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి వంటి హామీలు ఎక్కడికెళ్లిపోయాయో కూటమి నేతలు స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.
ప్రస్తుత వేసవికాలంలో కనీసం ప్రజారోగ్యాన్ని పటిష్ట పరచాలని, లేకపోతే పారిశుధ్యం, కలుషిత తాగునీరు వల్ల అనేక వ్యాధులు ప్రబలి పోయే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. పరిపాలనను గాలికి వదిలేసి కేవలం ప్రతిపక్షం వైయస్సార్సీపీకి చెందిన మాజీ మంత్రులు, నేతలు, కార్యకర్తలు, సోషల్ మీడియా యాక్టివిస్టుల పై రెడ్ బుక్ రాజ్యాంగం అంటూ పోలీస్ కేసులు అక్రమంగా బనయిస్తున్నారని ఆయన ఆరోపించారు.
కేవలం రెండేళ్ల పాలనలో ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజల నుంచి తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తమవుతుందని, ఇప్పటికైనా కూటమి పెద్దలు కళ్ళు తెరచి క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలను గుర్తించాలని, వాటి పరిష్కారానికి చొరవ చూపాలని, లేకపోతే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో భారీ మూల్యం చెల్లించుకోవలసి ఉంటుందని మడియ రామకృష్ణ హెచ్చరించారు.

## సమాజ సేవకు స్ఫూర్తిప్రదాత
# డా. పైడి. సింధూర


2లో

ఎడిటోరియల్

# తనదాకావస్తేకానీ...

సాధారణంగా ఏదీ ఎవరికి పట్టదు. పెద్దలు చెప్పినా, అనుభవంతో సెలవిచ్చినా, తేలికగా తీసుకుంటారు. ఇప్పుడు మనదేశంలో జరుగుతున్న పరిణామాల పర్యవసానం చాలా తీవ్రంగా ఉంటుందని చెబుతున్న మంచిమాటలు ఎవరైనా వింటున్నారా! అబ్బే! అసలు పట్టింపేలేదు. ఎవరి ప్రయోజనాలు వాళ్లేకానీ మొత్తంగా వ్యవస్థకు జరిగే హాని గురించి మాట్లాడనే మాట్లాడరు. పిల్లలు, యువత కూడా అంతే! అందుకనే పెద్దలు ఈ సామెతను చెప్పి ఉంటారు. 'ఏదయినా తనదాకా వస్తేకానీ, తెలియదని' ఇది నూటికి నూరుపాళ్లు నిజం. దేశంలో అనేకానేక అసంబద్ధ, అబద్ధ ప్రచారాలు, వక్రీకరణలు జరుగుతున్నాయి. కొత్తగా ఎవరి ఇష్టమొచ్చినట్లు వాళ్లు కథనాలు ప్రచారంలో పెడుతున్నారు. అందులో వారి రాజకీయ, ఆర్థిక, ప్రయోజనాలు దాగుంటున్నాయి తప్ప, వాస్తవాలు కనిపించటం లేదు. ఇవి తప్పని చెబుతున్న పెద్దల గొంతు బలహీనంగా ఉంటున్నది. ఎవరూ పట్టించుకోవడం లేదు. ఆ కథనాలే చరిత్ర వాస్తవాలుగా రేపు చలామణి అవుతాయి. ఇప్పుడు కూడా నమ్మేజనం ఉన్నారు. మొన్న కోవా బన్ను వలీపై వచ్చిన చర్చ ఎంత వక్రీకరణకు దారితీసిందో తెలుసు. బన్నుపై ఉమ్మి అమ్ముతారని, ఆ బన్నువల్ల సంతానలేమి కలుగుతుందని ఇంకా ఎన్నెన్నో విద్వేషాలను ప్రచారం చేశారు. ఇలాంటిదే ఇప్పుడు చరిత్ర పట్లా, రాజకీయ పరిణామాల పట్లా, సామాజిక విషయాల పట్లా, వక్రీకరణ ప్రచారాలు విరివిగా జరుగుతున్నాయి. అదీ అధికారమే చేస్తున్న ప్రచారం. మనకెందుకులే అని ఊరుకుంటున్న వాళ్లు చాలామంది ఉన్నారు. దీనివల్ల భవితకు తీవ్రనష్టం జరుగుతుంది.

నేడు ప్రధానంగా మహాత్మాగాంధీ, నెహ్రూలపై తీవ్రమైన దుష్ప్రచారం జరుగుతున్నది. ఒకటి రాజకీయమైనదైతే, రెండోది అతిదారుణంగా వ్యక్తిగత నైతిక విషయాలకు ప్రవర్తనాలకు సంబంధించింది. రెండూ పూర్తి అసత్యాలతో కూడుకున్నవి. రాజకీయ, పరిపాలనపరమైన విమర్శ వేరు. కానీ కావాలని పనిగట్టుకుని అబద్దాలను ప్రచారం చేయటం అనేది బీజేపీ అధికారంలోకి వచ్చాక జరుగుతున్నది. మహాత్ముని హిందూ వ్యతిరేకిగా చిత్రించడం, అతన్ని హతమార్చడం సరైన చర్యగానే సమర్థించడం, చంపిన గాడ్సేను పొగడటం, అతనికి భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేయడం వంటివి చాలా వికృతమైన ప్రచారాలు. సోషలిస్టు రష్యా ప్రభావంతో పంచవర్ష ప్రణాళికలను, ప్రభుత్వ సంస్థలను నెలకొల్పి అమలు పరచిన నెహ్రూను, దేశం వెనకబడటానికి ఆయనే కారణమని, విలాసలోబడని ప్రచారం చేస్తున్నారు. ఆనాడు నెలకొల్పిన సంస్థలన్నింటినీ ప్రయివేటుపరం చేస్తూ, మూసేస్తూ ఈ ప్రచారం చేయటం హోరమైన విషయం. ఇక చరిత్రలోంచి మొగలుల పరిపాలనా భాగాలను తీసేయటం, గాంధీని తీసేయటం, అంతేకాదు, పాఠాల నుండి జీవ పరిణామక్రమ సిద్ధాంతాన్నే తీసేయటం ఎంత దుర్భుద్ధితో కూడుకున్న చర్య. అంతేకాదు గుళ్లు కూలగొట్టింది ముస్లిం పాలకులే అన్న అబద్ధాన్నీ ప్రచారం చేస్తున్నారు. హిందూరాజులు కూడా గుళ్లు కూలగొట్టారనే సత్యాన్ని కప్పిపెడుతున్నారు.

దేశంలో గోమాంసం విదేశాలకు సరఫరా చేస్తున్న సంస్థలు హిందువులయితే, గోమాంసం కలిగి ఉన్నారనే నెపంతో ముస్లింలను కొట్టి చంపుతున్నారు. ఇలా సమస్తమూ అసంబద్ధంగా కొనసాగుతున్నది. ఇవ్వన్నింటినీ అడ్డుకోవాల్సింది ప్రజాఉద్యమాలు, మేధావులు, ఈ దేశపు న్యాయవ్యవస్థ కూడా. న్యాయవ్యవస్థయినా స్వతంత్రంగా వ్యవహరిస్తే ప్రజలకు కొంతమేలు జరగవచ్చు. కానీ, అది నామమాత్రమే అని చెప్పాలి. 'దేశంలో కార్మికసంఘాలు సమ్మెలతో దేశాభివృద్ధిని అడ్డుకుంటున్నాయి' అని సుప్రీంకోర్టు ఇటీవలే అసంబద్ధంగా వ్యాఖ్యానించింది. ఇది దేశ కార్మికవర్గాన్ని నివ్వెరపాటుకు గురిచేసింది. ఈ మధ్య ఎన్‌సిఈఆర్‌టి 8వ తరగతి పాఠ్యపుస్తకంలో న్యాయ వ్యవస్థలో అనేక విభాగాలలో అవినీతి ఉన్నదని పాఠ్యాంశంగా చేర్చిన విషయం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి దృష్టికి వచ్చింది. ఇది కుట్రపూరితదాడి అని, ఎవరైనా సంస్థలను బదనామ్ చేస్తే కోర్టులు ఊరుకోవని, వెంటనే ఆ పాఠ్యాంశాన్ని తొలగించాలని ఆదేశించారు. సుమోటోగా కేసును స్వీకరించారు. ఒక్క న్యాయవ్యవస్థే కాదు, రాజకీయాలలోని అవినీతి మాటేమిటి? మంత్రుల, ఉద్యోగుల, దర్యాప్తు సంస్థలలో కొనసాగుతున్న అవినీతి సంగతేమిటని, న్యాయకోవిధులు ప్రశ్నలు సంధి స్తున్నారు. నిజమేమరి. ఇదే సందర్భంలో నోట్లకట్టలతో దొరికిన న్యాయమూర్తి ఉదంతాన్ని విస్మరించలేము. అవినీతి అనేది ఈ వ్యవస్థలో అన్నింటిలోనూ కొనసాగుతుందనేది మాత్రం వాస్తవం. కానీ, మొత్తం సంస్థలకు అవమానపరచడం సరికాదు. అయితే ఏదయినా తనదాకావస్తేకానీ... స్పందన సరిగా ఉండదనేది అర్థమయ్యే విషయం.

## సమాజ సేవకు స్ఫూర్తిప్రదాత డా. పైడి.సింధూర

**- మహిళా దినోత్సవ వారోత్సవాలలో భాగముగా ఉచిత వైద్యసేవలు**

**నవతరం -శ్రీకాకుళం**

సమాజ సేవకు స్ఫూర్తిప్రదాత డా. పైడి.సింధూర అని, సాయిబాబా ఈవెంట్స్, జిఈఓ సద్గుణ అన్నారు. మహిళా దినోత్సవ వారోత్సవాల సందర్భంగా సాయి బాబా ఈవెంట్స్, జిఈఓ సద్గుణ్, స్వరూప్ ఆధ్వర్యంలో ఉచిత ఈఎన్టి వైద్యసేవలను లయన్ డా. పైడి సింధూర సహకారంతో అందించారు. ఇందులో బాగముగ నిర్వాహకులు మాట్లాడుతూ మహిళల ఆరోగ్యం కోసం ఆమె అందిస్తున్న విశిష్ట వైద్య సేవలు, సమాజ సేవ పట్ల ఉన్న అంకితభావాన్ని ప్రశంసించారు. మహిళల కోసం నిర్వహించిన ఉచిత ఈఎన్టీ ఆరోగ్య శిబిరానికి ఆమె అందించిన సహకారం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం మహిళల ఆరోగ్య అవగాహనకు, సామాజిక సేవకు ప్రాధాన్యతను చాటిచెప్పిందని డా. పైడి.సింధూర అన్నారు. అనంతరం సాయిబాబా ఈవెంట్స్ సాయిబాబా, జిఈఓ సద్గుణ, స్వరూప్ లు, వైద్యురాలను దుస్సాలువాలతో సత్కరించి ముందస్తు మహిళాదినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసారు.

# లిఫ్ట్ మరమ్మతులకు టెండర్లు పిలవాలి

**సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి డి గోవిందరావు**




**నవతరం -శ్రీకాకుళం**

కొండపేట లిఫ్ట్ మరమ్మతులకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించి టెండర్లు పిలవాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి డి గోవిందరావు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు హనుమంతు ఈశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కోటబొమ్మాలి మండలం కొండపేట లిఫ్ట్ ఇరిగేషన్ జల సాధన కమిటీ సమావేశంలో వారు మాట్లాడుతూ, కొండపేట లిఫ్ట్ మరమ్మతులకు మార్చి నెలలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని, లేకుంటే ఈ ఏడాది కూడా రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందని వారన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కోటబొమ్మాలి మండలంలో కొండపేట లిఫ్ట్ పరిధి గ్రామాల్లో నీరు లేక నిరంతరం కరువు బారిన పడడంతో ఈ ప్రాంతం అత్యంత వెనుక బాటుకు కారణంమైందని, దీంతో ఉపాధి లేక వలసలు పోవాల్సివస్తోందన్నారు. 2012లో జలయజ్ఞంలో భాగంగా కొండపేట లిఫ్ట్ మంజూరైందని, 2019లో ప్రారంభించి 2020 నాటికి మరమ్మతులతో మూతపడటంతో ఈ ప్రాంత రైతాంగం ఆర్థికంగా, ఆరోగ్యపరంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొండపేట లిఫ్ట్ పరిధిలో 22 గ్రామాల పరిధిలో 2.500 ఎకరాలకు నీరిస్తే ఈ ప్రాంతం అభివృద్ధి అవుతుందన్నారు.

రైతు కన్నీరు ఆగాలంటే వంశధార నీరు రావాలని ఆయనన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హామీ మేరకు మార్చి 4వ తేదీన జరగవలసిన జల దీక్షను ఏప్రిల్ మొదటి వారానికి వాయిదా వేయాలని సమావేశం తీర్మానించింది.

ఈ సమావేశంలో కొండపేట లిఫ్ట్ జలసాధన కమిటీ నాయకులు సనపల నారాయణరావు, గుంట కాశవయ్య జి.లక్ష్మణరావు, గుంట బాలయ్య, సనపల లంబోధర్, ఎస్.కసవయ్య, ధర్మారావు, ఎస్.నాగేశ్వరరావు , శ్రీరాములు, గుంట ధనలక్ష్మి, శ్యామలమ్మ తదితరులు పాల్గొన్నారు.

# తీరప్రాంత అభివృద్ధికి సీఎస్ఆర్ నిధులు...

**- విద్యుద్దీపాల ఏర్పాటుకు ఆమోదం**
**- ఎమ్మెల్యే బగ్గ రమణమూర్తి**




**నవతరం-పోలాకి**

నరసన్నపేట నియోజకవర్గంలో తీరప్రాంతాల్లో విద్యుత్ వెలుగులు నింపే దిశగా కీలక ముందడుగు పడిందని పార్లమెంట్ సభ్యుడు, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రతిపాదన మేరకు కూల్ ఇండియా లిమిటెడ్ సంస్థ సిఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) కార్యక్రమం కింద తీరప్రాంతాల్లో ఎలక్ట్రికల్ దీపాల ఏర్పాటు చేపట్టనున్నట్లు పోలాకి మండలం కత్తిరివానిపేట క్యాంప్ కార్యాలయంలో నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బగ్గు మాట్లాడుతూ, తీరప్రాంత గ్రామాలు సాయంత్రం తర్వాత చీకటిలో మగ్గిపోతున్న పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రజలకు భద్రత, సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో ఈ ప్రతిపాదనను కేంద్ర మంత్రి ముందుకు తీసుకువచ్చారని పేర్కొన్నారు. ముఖ్యంగా మత్స్యకారులు, తీరప్రాంత ప్రజలు రాత్రివేళల్లో రాకపోకలు సాగించేందుకు సరైన వెలుతురు అవసరమని, మహిళలు, వృద్ధులు, పిల్లల భద్రత దృష్ట్యా వీధి దీపాలు అత్యంత అవసరమన్నారు. ఈ ప్రతిపాదనకు సంబంధించి అవసరమైన పరిపాలనా ప్రక్రియలు పూర్తి చేసి శాంక్షన్ సాధించడంలో కేంద్ర మంత్రి కీలక పాత్ర పోషించారని తెలిపారు. తీరప్రాంత అభివృద్ధికి ఎల్లప్పుడూ కృషి చేస్తున్న కేంద్ర మంత్రికి తీరప్రాంత ప్రజల తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి వెల్లడించారు. సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు కానున్న విద్యుత్ దీపాల ద్వారా రాత్రివేళల్లో ప్రమాదాలు తగ్గడమే కాకుండా సామాజిక భద్రత మెరుగుపడుతుందని, తీరప్రాంతాల్లో అభివృద్ధికి ఇది ఒక ముఖ్యమైన అడుగుగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను తీసుకువచ్చి నరసన్నపేట నియోజకవర్గాన్ని సమగ్రంగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

# 6న మెగా రక్తదాన శిబిరం

**- 6, 7 తేదీల్లో ఉచితంగా గైనిక్, జనరల్ మెడిసిన్ ఉచిత ఓపీ**
**- విలేకరుల సమావేశంలో మెడికవర్ సెంటర్ హెడ్ డాక్టర్ సాగరిక**




**నవతరం -శ్రీకాకుళం**

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ నెల 6న మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు మెడికవర్ సెంటర్ హెడ్ డాక్టర్ పి.సాగరిక తెలిపారు. నగరంలోని మెడికవర్ ఆసుపత్రిలో బుధవారం గైనకాలజిస్ట్ డాక్టర్ బలగ రజిని, జనరల్ ఫిజీషియన్ కె.అమూల్యలతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఇటీవల కాలంలో మహిళలకు ఆరోగ్య సంబంధిత వ్యాధులు ఎక్కువగా ప్రబలుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దైనందిన జీవితంలో మహిళలు కుటుంబ సభ్యుల ఆరోగ్యం నిమిత్తం పట్టించుకుంటున్నారు తప్పా, వారి ఆరోగ్యంపై ఆలోచన చేయడం లేదన్నారు. మహిళల్లో వ్యాధులను ముందుగా గుర్తించి వ్యాధుల పట్ల వారికి అవగాహన కల్పించి 6,7 తేదీల్లో ఉచితంగా ఓపీ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అదేవిధంగా 50 శాతం రాయితీతో మహిళలకు ల్యాబ్ పరీక్షలు కూడా నిర్వహించనున్నామని వివరించారు. ఆరో తేదీన మెగా రక్త దాన శిబిరం మెడికవర్ రెండో బ్లాక్ లో నిర్వహిస్తున్నట్టు చెప్పారు. గైనికాలజిస్ట్ డాక్టర్ బలగ రజని మాట్లాడుతూ, ముఖ్యంగా మహిళల్లో ఇటీవల అధికంగా ప్రబలుతోన్న గర్భాశయ క్యాన్సర్ పై అవగాహన కల్పించడం, గర్భాశయ క్యాన్సర్ నిర్ధారణ పరీక్ష ( పాప్ స్మియర్) ఉచితంగా చేపడుతున్నట్టు వెల్లడించారు. ఈ అవకాశాన్ని మహిళలు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెడికవర్ ఏజీఎం టీఎస్ఎన్.మూర్తి పాల్గొన్నారు.

# న్యాయశాఖ మంత్రిని కలిసిన ఎమ్మెల్యే ఎంజీఆర్

**నవతరం-పాతపట్నం**




పాతపట్నం, కొత్తూరు జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టులకు నూతన భవనాల నిర్మాణానికి నిధుల మంజూరుచేయాలని న్యా శాఖమంత్రి ఎన్ఎండీ.ఫరూఖ్‌ను పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. ఈ మేరకు ఆయనకు విజ్ఞపన పత్రం అందజేశారు. మెళియాపుట్టి మండలాన్ని పాతపట్నం సివిల్ జడ్జి కోర్టు పరిధిలోకి చేర్చాలని ఆయన కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ. ఫరూక్‌ను పాతపట్నం నియోజకవర్గ శాసనసభ్యుడు మామిడి గోవిందరావు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పాతపట్నం నియోజకవర్గ కేంద్రం, కొత్తూరు మండల కేంద్రాల్లోని జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టు భవనాలు ప్రస్తుతం శిథిలావస్థలో నుండటంతో న్యాయవాదులు, కక్షిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మంత్రికి వివరించారు. అలాగే మెళియాపుట్టి మండలం ప్రస్తుతం టెక్కలి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు పరిధిలో ఉండటంతో ప్రజలు దూరప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని, ఈ నేపథ్యంలో మెళియాపుట్టి మండలాన్ని పాతపట్నం సివిల్ జడ్జి కోర్టు పరిధిలోకి చేర్చాలని కోరారు.

# "మనిషీ మారాలి"




బాధలో ఉన్నవాడిని చూసి నవ్వకూడదు...
మనసు కరిగి తోడుగా నిలవాలి...

అందరూ సమానమే అనాలి...
అది చేతల్లో చూపాలి...
స్వార్థం వదిలి ప్రేమను పంచాలి...
ప్రేమతో జీవితం పచ్చగా చేయాలి...

ప్రకృతికి కోపం రాకముందే మారాలి...
తప్పును తెలుసుకొని సరిచేసుకోవాలి
మనిషి తన గుణం మార్చుకోవాలి ...
లేకపోతే పతనం తప్పదని
తెలుసుకోవాలి...

మనిషీ మారాలి... ప్రేమతో జీవించాలి...
మానవత్వమే నిజమైన దైవం...
ఆ దైవమే గుండెల్లో నిలవాలి... ??

మనిషీ మారాలి... మనసు మారాలి...
మనలో మానవత్వం నింపాలి
ద్వేషపు మంటలు దూరం కావాలి...
ప్రపంచంలో ప్రేమ వెలుగు నింపాలి...

మానవత్వం మసకబారింది...
దానవత్వం పైకి ఎగసింది ...
భూమి గుండె బాధపడింది...
మనిషి చూపు తీరు మారింది

మనిషీ మారాలి... కరుణ పెరగాలి...
కుటిల భావం దూరం కావాలి...
మంచి మాటలు పలకాలి...
మంచి దారిలో నడవాలి...

కుట్రలు పన్నే వాడు పడిపోతాడు...
తానే వేసిన మంటలో కాలిపోతాడు...



-తేరాల రాజేంద్ర ప్రసాద్ గుప్తా
రత్నలహరి ఛానల్ సీఈవో
9297109223 సికింద్రాబాద్

# అంగన్‌వాడీలపై ప్రభుత్వ నిర్బంధకాండ అమానుషం

## సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సీహెచ్.అమ్మన్నాయుడు




**శ్రీకాకుళం-నవతరం**
అంగన్‌వాడీలపై ప్రభుత్వ నిర్బంధకాండ అమానుషమని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.అమ్మన్నాయుడు అన్నారు. విజయవాడ ధర్నా చౌక్ లో తమ న్యాయమైన సమస్యలు పరిష్కారం కోరుతూ మహాధర్నా నిర్వహిస్తున్న అంగన్‌వాడీలను రాష్ట్ర ప్రభుత్వం పోలీసులతో వేకువజామున అక్రమ అరెస్టులు చేయడాన్ని నిరసిస్తూ, అంగన్‌వాడీలకు వేతనాలు వెంటనే పెంచాలని కోరుతూ ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో శ్రీకాకుళం ఆర్టీసీ బస్టాండ్ నుండి డే అండ్ నైట్ జంక్షన్ వరకు ర్యాలీ జరిగింది. అనంతరం జరిగిన నిరసన సభలో వారు మాట్లాడుతూ, ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయమని శాంతియుతంగా ధర్నా చేస్తుంటే పోలీసులు లైట్లు ఆపి చీకట్లో మహిళలని చూడకుండా ఈడ్చి అరెస్టులు చేశారన్నారు. పోలీసుల దాడిలో ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు బేబీ రాణి చేయి విరిగిందని, కొంతమంది స్పృహ తప్పి పడిపోయారని అన్నారు. చంద్రబాబు నాయుడు చెప్పే మహిళా సాధికారత ఇదేనా? అని ప్రశ్నించారు. ఐసీడీఎస్ ప్రారంభించి 50 సంవత్సరాలు పూర్తయినా, నేటికీ అంగన్‌వాడీలను కార్మికులుగా గుర్తించలేదని, కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్ సౌకర్యం అమలు చేయటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత 7 సంవత్సరాల్లో ధరలు విపరీతంగా పెరిగినా ఒక్క రూపాయి వేతనం కూడా పెంచలేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమాజంలో పేద గర్భిణీ, బాలింతలు, చిన్నపిల్లలకు సేవలందిస్తున్న అంగన్‌వాడీలను నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. కేంద్ర బడ్జెట్ లో కార్పొరేట్లకు భారీగా రాయితీలు ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం ఐసీడీఎస్‌కు మాత్రం తగిన నిధులు కేటాయించలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2026-27 కి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లోనూ అంగన్‌వాడీలకు అన్యాయం జరిగిందన్నారు. ప్రస్తుత అవసరాలకు సరిపోను బడ్జెట్ కేటాయింపులు లేవని, బాలసంజీవి, పోషణప్లస్, సాక్ష్యం అంగన్‌వాడీ కేటాయింపులు నామ మాత్రంగానే ఉన్నాయన్నారు.

# క్రాప్ డైవర్షన్‌కు ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ...రైతుల ఆదాయవృద్ధే లక్ష్యం

**మొదటిపేజీ తరువాయి**
రైతులకు గిట్టుబాటు కాదని తెలిపారు. వరిని పూర్తిగా మానేయాలని ప్రభుత్వం చెప్పడం లేదని, అయితే పాత వంగడాల బదులు నాణ్యమైన, ఎగుమతులకు అనుకూలమైన కొత్త వంగడాలను ప్రోత్సహిస్తున్నామని స్పష్టం చేశారు. మొదటి దశలో రాయలసీమ జిల్లాల నుండి ప్రకాశం జిల్లా వరకు 15 లక్షల హెక్టార్లలో క్రాప్ డైవర్షన్ చేపట్టి హార్టికల్చర్ హబ్‌లుగా అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా 30,000 కోట్లు, ప్రైవేట్ రంగం ద్వారా 70,000 కోట్లు సమీకరించి హార్టికల్చర్ అభివృద్ధి ప్రణాళిక రూపొందిస్తున్నామని వెల్లడించారు. సంవత్సర కాలంలో రైతులకు వరి పంటలో ఎకరాకు సుమారు ?6,000 ఆదాయం మాత్రమే వస్తుండగా, కంది పంటకు 26,000, మినుముల పంటకు 21,000, జొన్న పంటకు 16,000, పామాయిల్ పంటకు 1.50 లక్ష రూపాయల లాభం వస్తుందని వివరించారు. డైవర్షన్‌కు ముందుకొచ్చే రైతులకు పామాయిలు ఉచిత మొక్కలు, సాంకేతిక సలహాలు, డ్రిప్, స్ప్రింక్లర్ సదుపాయాలు కల్పించి, పండించిన పంటలను కొనుగోలు చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని తెలిపారు. మొక్కజొన్నకు ?2400 మద్దతు ధర ప్రకటించి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ప్రస్తుతం రిజర్వాయర్లలో 90 శాతం నీటి నిల్వలు ఉన్నందున ఖరీఫ్ సాగును రెండు నెలలు ముందుకు తీసుకురావాలని, మే నెలలో ఖరీఫ్ ప్రారంభం అయ్యేలా ప్రతి గ్రామంలో ప్రత్యేక క్యాంపెయిన్లు నిర్వహిస్తున్నామని, ఎమ్మెల్యేలు రైతులకు అవగాహన కల్పించాలని మంత్రి పిలుపునిచ్చారు. కౌలు రైతుల విషయానికి వస్తే, 9.13 లక్షల మందికి సీసీఆర్‌సీ కార్డులు జారీ చేసి ?4474 కోట్లు రుణాలుగా మంజూరు చేశామని వెల్లడించారు. రైతుల ఆదాయ వృద్ధి, స్థిరమైన వ్యవసాయ అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి అచ్చెన్నాయుడు అసెంబ్లీలో స్పష్టం చేశారు.



# క్లారిటీ.. కల్కి-2లో కూడా కనిపిస్తుందంట!

కల్కి సినిమాలో ప్రభాస్ సరసన దిశా పటానీ నటించింది. అయితే ఆమె పాత్రకు పూర్తి న్యాయం జరగలేదు. కథ ముందుకెళ్లేకొద్దీ, ఆమె పాత్ర ప్రాధాన్యం తగ్గిపోయింది. కొంత దూరం వెళ్లిన తర్వాత దిశా పాత్ర పూర్తిగా మాయమైపోయింది. దీపిక పదుకోన్ షో మొదలైంది.
అలా కల్కి సినిమాలో అర్థాంతరంగా మాయమైన దిశా పటానీకి, ఇక పార్ట్-2లో చోటు దక్కదని అంతా అనుకున్నారు. ఎందుకంటే, కల్కి-2 మొత్తం ప్రభాస్, కమల్‌హాసన్, అమితాబ్ బచ్చన్ చుట్టూ తిరుగుతుందనే విషయం క్లయిమాక్స్ చూసిన ఎవరికైనా అర్థమౌతుంది. కానీ తను కూడా ఉన్నానంటోంది దిశా.
కల్కి-2లో సినిమాలో తను కూడా కనిపిస్తానంటోంది దిశా పటానీ. త్వరలోనే తను షూట్‌లో కూడా జాయిన్ అవుతానని క్లారిటీ ఇచ్చింది. తొలి భాగంలో ఆమెకు ఓ సాంగ్ కూడా ఉంది. సీక్వెల్‌లో మాత్రం తనది కేవలం టాకీపార్ట్ అని చెబుతోంది. అయితే మొదటి భాగంతో పోలిస్తే, ఎక్కువసేపు కనిపిస్తానని అంటోంది.
టైగర్ ష్రాఫ్‌కు గుడ్ బై చెప్పిన తర్వాత ఓ పంజాబీ సింగర్‌తో సన్నిహితంగా ఉంటోంది దిశా పటానీ. ఈమధ్య ఇద్దరూ కలిసి చాలా క్లోజ్‌గా దిగిన ఫొటోలు కూడా బయటకొచ్చాయి. ఓవైపు ఇలా వ్యక్తిగత జీవితంతో వార్తల్లో నలుగుతూనే, మరోవైపు సినిమాల విషయంలో కూడా జోరు పెంచింది ఈ అందగత్తె.

# టాలీవుడ్ లో ఇక మిగిలింది వీళ్లే!

అఖిల్ పెళ్లి చేసుకున్నాడు, విజయ్ దేవరకొండ ఓ ఇంటి వాడయ్యాడు. నారో రోహిత్ పెళ్లి కూడా అయిపోయింది. శిరీష్ కూడా పెళ్లిపీటలు ఎక్కబోతున్నాడు. ఇలా వరుసగా హీరోలు పెళ్లిళ్లు చేసుకుంటున్న నేపథ్యంలో, టాలీవుడ్ లో మిగిలిన బ్యాచిలర్స్ పై చర్చ మొదలైంది. వీళ్లలో ముందు వరుసలో ఉన్న వ్యక్తి సాయిదుర్గతేజ్.
తన ప్రేమ-పెళ్లిపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ వస్తున్నాడు సాయిదుర్గతేజ్. 39 ఏళ్ల ఈ హీరో, రీసెంట్ గా తన పెళ్లిపై రియాక్ట్ అయ్యాడు. అన్నీ అనుకున్నట్టు జరిగితే ఈ ఏడాదిలోనే సాయితేజ్ పెళ్లి ఉంటుంది.
అంతకుమించి వివరాలు వెల్లడించలేదు ఈ హీరో.
నడిచాయి ఈమధ్య. 37 ఏళ్ల ఈ హీరో, హీరోయిన్ భాగ్యశ్రీతో డేటింగ్ లో ఉన్నాడని, ఆమెను త్వరలోనే పెళ్లి చేసుకుంటాడనే ప్రచారం నడిచింది. అయితే ఆ డేటింగ్ రూమర్స్ తో పాటు, పెళ్లి పుకార్లు కూడా ఈమధ్య కాస్త మందగించాయి.
నవీన్ పొలిశెట్టి (36), సందీప్ కిషన్ (38) కూడా మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్స్ గా కొనసాగుతున్నారు. రీసెంట్ గా తన సినిమా ప్రచారంలో మాట్లాడుతూ.. ప్రభాస్ ఎప్పుడు పెళ్లి చేసుకుంటే తను కూడా ఆ వెంటనే పెళ్లి చేసుకుంటానంటూ తప్పించుకున్నాడు నవీన్ పొలిశెట్టి. ఇక సందీప్ కిషన్ అయితే టైమ్ వచ్చినప్పుడు అదే జరుగుతుందంటూ చెప్పుకొస్తున్నాడు.
తన పెళ్లి పుకార్లతో ఆ మధ్య ఓ సినిమాకు గట్టిగానే ప్రచారం దక్కించుకున్నాడు ఈ హీరో.
వీళ్లు కాకుండా లిస్టులో అడివి శేష్ (40), బెల్లంకొండ (33), సిద్ధు జొన్నలగడ్డ (38), విశ్వక్ సేన్ (31), రాజ్ తరుణ్ (34) కూడా ఉన్నారు. వీళ్లలో కొంతమంది తమ ప్రేమ విషయాన్ని గోప్యంగా ఉంచుతున్నారు. ఇక మిగిలిన మరో హీరో ప్రభాస్. 46 ఏళ్ల ప్రభాస్ పెళ్లి విషయాన్ని ఆయన అభిమానులే పెద్దగా పట్టించుకోవడం లేదు.



# 6న ఉద్యోగ మేళా

**నవతరం-శ్రీకాకుళం**

నిరుద్యోగ యువతకు ప్రైవేటు రంగంలో ఉపాధి కల్పించేందుకు ఈనెల 6న శ్రీకాకుళంలో భారీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కొత్తలంక సుధ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రభుత్వ హాస్పిటల్ జంక్షన్ సమీపంలోని ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో ఉదయం 10 గంటల నుంచి ఈ ఎంపికలు ప్రారంభమవుతాయి. జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో జరిగే ఈ మేలాలో యపిటోరియా (అరబిందో), అన్నపూర్ణ ఫైనాన్స్, డెక్కన్ ఫైన్ కెమికల్స్ వంటి ప్రముఖ సంస్థలు పాల్గొని సుమారు 230 ఖాళీలను భర్తీ చేయనున్నాయి. పదో తరగతి, ఇంటర్, ఏదైనా డిగ్రీతో పాటు బి.ఎస్సీ/ఎమ్మెస్సీ (కెమిస్ట్రీ), డిప్లొమా కెమికల్ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ఈ మేళా ద్వారా ఎంపికైన వారికి పోస్టును బట్టి నెలకు రూ.14,500 నుండి రూ.35,000 వరకు వేతనం లభిస్తుందని, శ్రీకాకుళం, విజయనగరం, పరవాడ, పాయకరావుపేట వంటి ప్రాంతాలలో పనిచేయాల్సి ఉంటుందని అధికారులు వెల్లడించారు.

ఆసక్తి గల అభ్యర్థులు తమ బయోడేటా, విద్యా అర్హత ధ్రువపత్రాల నకళ్లు, ఆధార్ కార్డుతో నేరుగా హాజరుకావచ్చని సూచించారు.

అభ్యర్థులు ముందుగా తమ వివరాలను www.ncs.gov.in పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. 18 నుండి 35 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన యువతీ యువకులు ఈ మేళాకు హాజరుకావచ్చని, మరిన్ని వివరాలకు స్థానిక ఉపాధి కార్యాలయంలో సంప్రదించాలని వివరించారు.

## జిల్లా స్థాయి మాస్టర్స్
# క్రీడా పోటీల ఎంపికలు

**నవతరం-శ్రీకాకుళం**

ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఆదేశాల మేరకు జిల్లాలో 'శాప్ లీగ్ - మాస్టర్స్ స్పోర్ట్స్ (వెటరన్స్)' ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి మహేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు sports.ap.gov.in వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

**ఎంపికల వివరాలు:**

టెన్నిస్ (పురుషులు, మహిళలు): 40 ఏళ్లు పైబడిన వారు అర్హులు. సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో మార్చి 8న శ్రీకాకుళం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఎంపికలు జరుగుతాయి.

బ్యాడ్మింటన్: 35 ఏళ్లు పైబడిన పురుషులు, మహిళలు, 45 ఏళ్లు పైబడిన పురుషులకి మార్చి 8న శ్రీకాకుళం డి.ఎస్.ఏ ఇండోర్ స్టేడియంలో ఎంపికలు నిర్వహిస్తారు.

అథ్లెటిక్స్: 35 ఏళ్లు పై బడిన పురుషులు మహిళలు 45 ఏళ్లు పైబడిన పురుషులకు 100 మీ., 400 మీ., 800 మీ., 1500 మీ. పరుగు పందట్లలతో పాటు లాంగ్ జంప్, షాట్‌పుట్, డిస్కస్ త్రో, హైజంప్, జావలిన్ త్రో, 4ఇ100 రిలే పోటీలు ఉంటాయి. ఇవి మార్చి 24న కేఆర్ స్టేడియంలో జరగనున్నాయి.

**రాష్ట్ర స్థాయి పోటీలు:**

జిల్లా స్థాయిలో ఎంపికైన వారు మార్చి నెలలో విజయనగరం (టెన్నిస్), కోనసీమ (బ్యాడ్మింటన్), గుంటూరు (అథ్లెటిక్స్)లలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఇతర వివరాలకు 9390352942, 9494814087 నంబర్లను సంప్రదించాలని కోరారు.

# కుల మతాలకు అతీతంగా జరుపుకునే పండుగ హోలీ




**నవతరం-శ్రీకాకుళం**

సమైక్యత.. సమగ్రతను కాపాడే పండగ హోలీ అని.. కులమతాలకతీతంగా అందరూ కలిసికట్టుగా జరుపుకొనే ఏకైక పండగ హోలీ అని శ్రీకాకుళం గిరిజన సంక్షేమ శాఖ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి. శ్రీనివాసరావు అన్నారు. శ్రీకాకుళం నగరంలో ఆర్ట్స్ కళాశాల వెనుకనున్న ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో బుధవారం హోలీ వేడుకలు స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ మాట్లాడుతూ, ఒకవైపు భీకర యుద్ధం జరుగుతున్నా మన దేశంలో హోలీ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయని, ఇది మన దేశప్రజల ఐక్యతకు ప్రతీక అన్నారు. స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు గేదెల ఇందిరాప్రసాద్, ఎస్. జోగినాయుడు మాట్లాడుతూ, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా హోలీ నిలుస్తుందన్నారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను దత్తత తీసుకున్న స్టార్ వాకర్స్ క్లబ్ ఇక్కడ చదువుతున్న విద్యార్థులకు కావలసిన మౌలిక సదుపాయాల కల్పణకు తమ వంతు కృషి చేస్తుందని చెప్పారు.. అంతకన్నా ముందు స్టార్ వాకర్స్ క్లబ్ సభ్యుడు గోవింద ఆశోక్ సారథ్యంలో గిరిజన విద్యార్థులకు రంగులు జల్లి హోలీ వేడుకలు ప్రారంభించారు. చిన్నారులు ఎంతో సందడి చేస్తూ హోలీ పండుగ జరుపుకొన్నారు.. ఈ ఏడాది హోలీ పండుగ రెండు రోజుల పాటు జరుపుకొన్నారు.

## గ్రామీణ యువతీ యువకులకు ఉచిత కంప్యూటర్
# శిక్షణ ఇచ్చి ఉద్యోగ కల్పన

### సెంటర్ మేనేజర్ పి. రవి

**నవతరం-శ్రీకాకుళం**

గ్రామీణ యువతీ యువకులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు దీన్ దయాల్ గ్రామీణ కౌసల్య యోజన కేంద్ర మేనేజర్ పి. రవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీన్ దయాల్ ఉద్యోగ కౌసల్య యోజన, స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న ఉచిత కంప్యూటర్ శిక్షణ నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రవేశానికి కావలసిన వయస్సు: 18-35 సంవత్సరాలు కలిగి, పదవ తరగతి మార్కుల జాబితా, ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్, కుల ధృవీకరణ, బ్యాంక్ పాస్ బుక్ ఉ 4 పాస్‌పోర్ట్ ఫోటోలు ఉండాలన్నారు. 90 రోజులు ఇచ్చే శిక్షణలో స్పోకెన్ ఇంగ్లీష్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, కస్టమర్ కేర్, రిటైల్ సేల్స్ ఎక్సెక్యూటివ్, కంప్యూటర్ బేసిక్స్ నేర్పబడునని వివరించారు. స్టడీ మెటీరియల్, యూనిఫారమ్ ఉచితంగా అందించబడునని, శిక్షణ కాలంలో ఉచిత హాస్టల్, భోజన సదుపాయం కల్పించబడునన్నారు.

శిక్షణ అనంతరం సర్టిఫికెట్‌తో పాటు ఉద్యోగం కల్పించబడునని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఉచిత శిక్షణ కొరకు దరఖాస్తులు కోరబడుచున్నవి. దరఖాస్తు చేయుటకు మార్చి 15వ తేదీ ఆఖరని తెలిపారు. సంప్రదించవలసిన చిరునామా MARG స్కిల్ డెవలప్మెంట్ సెంటర్, శ్రీ విశ్వ విజేత జూనియర్ కాలేజ్ బిల్డింగ్స్, శ్రీ చైతన్య స్కూల్ వెనుక, మహాలక్ష్మి నగర్ కాలనీ, శ్రీకాకుళం. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు 8341693700, 7842084099.

## మహిళలపై లైంగిక సామాజిక హింసకు
# మద్యము మాదకద్రవ్యాలే కారణం

### పి ఓ డబ్ల్యు సభ్యురాలు కే సుహాసిని

**నవతరం టెక్కలి**

నేడుటెక్కలి మండలం మొఖలింగాపురం, గ్రామంలో పిఓ డబ్ల్యుజిల్లా కార్యవర్గ సభ్యురాలు కె సుహాసిని పిలుపు ఇచ్చారు.

స్వార్థం, అవినీతి, అబద్ధాలను సహజమైన మానవ ప్రవృత్తిగా చూపిస్తూ అన్ని కోల్పోయి అభద్రతలో ఉన్న ప్రజలకు మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల్ని పరిష్కారంగా చూపుతూ రాజ్యమేలుతున్న పాలక విధానాలను మహిళా లోకం నిరసించాలని ప్రగతిశీల మహిళా సంఘం(పి ఓ డబ్ల్యూ) శ్రీకాకుళం జిల్లా కార్యవర్గ సభ్యురాలు కె .సుహాసిని పిలుపునిచ్చారు. ఈరోజు టెక్కలి మండలం ముఖలింగాపురం గ్రామంలో ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేసి, ప్రచారం నిర్వహించారు . ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి ఆమె మాట్లాడారు. వ్యవస్థలను మార్చకుండా కులం, అధికారం, డబ్బుకు ప్రభావితం అవుతున్న విధానాలను చూసి కూడా లోపాల్ని మహిళలపై నెట్టి చట్టాల అమలుకు దోపిడీ ప్రభుత్వం నిరాకరిస్తుందనీ, చట్టం చేసిన తర్వాత అమలు చేయలేకపోతే అది అమలు చేయలేని, తన అసమర్థత అని ప్రభుత్వం గుర్తించదన్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఆచరణలో మహిళా చట్టాల్ని అమలుకు పురుషాధిక్య పాలన నిరాకరిస్తుందని,



మహిళలపై లైంగిక, సామాజిక హింస పెరగడానికి మద్యం ప్రధాన కారణమని తెలిసి కూడా మద్యాన్ని ప్రభుత్వం ప్రధాన ఆదాయ వనరుగా చేసుకుందని ఆమె విమర్శించారు. అక్రమ పద్దతుల్లో అధికారాన్ని సంపాదించిన పాలకులు, దాన్ని నిలబెట్టుకునేందుకు ప్రజల్ని వ్యసనపరులుగా మార్చి వేస్తున్నారనీ దేశ సంస్కృతిని, ప్రకృతిని విధ్వంసం చేస్తూ సహజ వనరుల్ని శ్రమ సంపదలని పీల్చి పిప్పి చేసే మనువాద కార్పోరేట్ శక్తులు నడుపుతున్న విధానమే అభివృద్ధిగా నమ్మ పలుకుతున్నారని సుహాసిని దుయ్యబట్టారు. ఈ ప్రచార కార్యక్రమంలో ఆమెతోపాటు కార్యకర్తలు నిర్మల, కుమారి, డి. లక్ష్మమ్మ, కావ్య తదితరులు పాల్గొన్నారు.

# రైలు ప్రయాణికులకు సత్యసాయి సమితి సేవలు

**నవతరం-పొందూరు**

ఇబ్బందుల్లో ఉన్న వారిని ఆదుకోవడంలో సత్యసాయి సేవా విభాగాలు ఎనలేని సేవలందిస్తున్న సంగతి తెలిసిందే.తిలారు రైల్వే స్టేషన్ లో గూడ్స్ రైలులో గ్యాస్ లీకేజీ నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా స్థానిక రైల్వే స్టేషన్ లో మంగళవారం రాత్రి మొత్తం ఆరు ట్రెయిన్లు చాలా సేపు నిలిపివేశారు. ప్రయాణికులకు ఎదురైన ఇబ్బందులను గమనించి ఇక్కడి సత్యసాయి సేవా సమితి సభ్యులు, యువజనులు,బాల వికాస్ పిల్లలు స్పందించి సేవలందించారు.అరటి పళ్లు, బిస్కెట్లు, రొట్టెలు, వాటర్ పేకెట్లను రాత్రి 11గంటల వరకు ప్రయాణికులకు ఉదారంగా అందజేసి,మానవతా విలువలకు భాష్యం చెప్పారు.ప్రయాణికులు సేవా సమితికి కృతజ్ఞతలు తెలిపారు.వీరి సేవలను స్థానికులు అభినందించారు.సత్యసాయి సేవా సమితి కన్వీనర్ దున్న రాధాకృష్ణ ఆధ్వర్యం వహించారు.



## ఎస్సీలు పై బలవంతపు, ఋణాలు
# రికవరీ చేస్తే సహించం



### పొన్నాడ రుషి ఎస్సి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.సి.పి

**నవతరం-శ్రీకాకుళం**

జాతీయ దళిత ఆర్థిక సంస్థ ద్వారా N.S.F.D.S మరియు జాతీయ సఫాయి కర్మచారిస్ ఆర్థిక అభివృద్ధి సంస్థ M.S. K. F. D. C పథకాల కింద ఎస్సీ కార్పొరేషన్లకు మంజూరు చేయాల్సిన నిధులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి బడ్జెట్లో ఏనాడైనా ఎస్సి కార్పొరేషన్ ద్వారా నిరుద్యోగ యువత ఉపాధికొరకు ఏనాడైనా మేలు చేసిందా? కేవలం ప్రతి బడ్జెట్లో గణాంకాలకే పరిమితమై ఎస్సి, ఎస్టి ఆర్థిక నిధులు దారి మళ్లించడం తప్ప రాజ్యాంగబద్ధంగా కేటాయించాల్సిన పద్ధతిలో ఏనాడైనా సక్రమమైన పద్ధతుల అమలు జరిగిందా? చివరికి రాష్ట్రానికి వచ్చిన నిధులు సైతం బినామీ పేర్లతో సబ్సిడీలకు ఆశపడి మీకు అనుకూలమైన వ్యక్తులకు ఎస్సీ కార్పొరేషన్ రుణాలు మంజూరు చేయించుకోవడం వాస్తవం కాదా? నేటికీ ఎస్సీ, ఎస్టీలు బ్రతుకుతెరువులు స్వాతంత్రం వచ్చిన 75 సంవత్సరాల తర్వాత కూడా మారని జీవితాలుగా మిగిలిపోవడం, మీ పాలన నిర్లక్ష్యం కాదా? మీరిచ్చిన అరకొర రుణాలు అప్పులు తీర్చలేక కొత్త అప్పులు చేసి నిజాయితీగా రుణాలు కడుతున్న దళితులపై బలవంతపు రుణాలు వసూలు చేస్తే సహించబోమని, మీరు హుకుం జారీ చేసి కార్పొరేషన్ అధికారులకు ఆదేశాలు ఇవ్వటం ఎంత మాత్రం సహించుబోమని, సబ్సిడీల కోసం బినామీ పేర్లతో రుణాలు మంజూరు చేసిన మీ తాపేదారులద్వారా ముందుగా బలవంతపు రుణాలు రికవరీ చేయించాలని, సంపద సృష్టిస్తానంటే అర్థం దళితుల ఆర్థిక స్థితిగతుల్ని నిర్వీర్యం చేయడం కాదు అధ్యయనం చేసి వారి పురోగతిని ప్రోత్సహించడం తప్ప, ఆర్థికంగా వెనుకబడిన దళితుల్ని రోడ్డున పడి వేయడం కాదని, పరిపాలన చేతకాని పాలనలో ఒక రెడ్బుక్ రాజ్యాంగాన్ని పెట్టుకొని ఇష్టానుసారం దళితులపై దాడులు దాష్టకాలు, దౌర్జన్యాలు అవమానాలు ,చేస్తూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని విరుద్ధంగా పాలన చేస్తుండడం దళిత మేధావులు అందరూ గమనిస్తున్నారని, దళిత పారిశ్రామిత్తలుగా ప్రోత్సహిస్తానని చివరికి రోడ్డు మీద పడి వేసే పరిస్థితి, మీ ప్రభుత్వం పై నిరసన తెలియజేయుట వాస్తవం కాదని, ఆనాడు స్వర్గీయ వైఎస్ రాజశేఖర్ రెడ్డి గారి హయాంలో పూర్తి ఎస్సీ కార్పొరేషన్ రుణమాఫీ చేయటం ,కరోనా కష్టకాలంలో ఎస్సీ లోన్ రికవరీ జోలికి పోకుండా వారికి అనేక సంక్షేమ పథకాలు ద్వారా ఆర్థికంగా వైఎస్ .జగన్మోహన్ రెడ్డి ఆదుకోవడం గుర్తు చేస్తూ.. మరొకసారి ఎస్సీలు జోలికి వస్తే తగిన గుణపాఠం చెబుతామని ఈ పత్రిక ప్రకటన ద్వారా తెలియజేశారు.

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**